www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దినపత్రిక
సోమవారం 9 జూన్ 2025
సంపుటి :07 సంచిక : 13 , పేజీలు : 12 వెల:రూ. 5/-

ముగిసిన మాగంటి గోపీనాథ్ అంత్యక్రియలు...

## పాడె మోసిన కేటీఆర్, హరీశ్ రావు

- గుండెపోటుతో ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి
- జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు
- హాజరైన కేటీఆర్, హరీశ్ రావు, పలువురు బీఆర్ఎస్ నాయకులు



### కొత్త మంత్రులకు శుభాభినందనలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి...

# ముగ్గురూ తొలిసారి ఎమ్మెల్యేలే!

- తెలంగాణలో మంత్రివర్గ విస్తరణ
- నూతన మంత్రులు, డిప్యూటీ స్పీకర్ నియామకం
- వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరికి మంత్రి పదవులు
- శాసనసభ ఉపసభాపతిగా రామచంద్రు నాయక్ నియామకం
- ఈ నలుగురు నేతలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు









**హైదరాబాద్ వెలుతురు జూన్ 08:**
తెలంగాణ క్యాబినెట్ విస్తరణ జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, నూతన మంత్రులకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విషెస్ తెలియజేశారు. నూతన మంత్రులుగా వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరి అవకాశం దక్కించుకున్న సంగతి తెలిసిందే. అదేవిధంగా, శాసనసభ ఉపసభాపతి (డిప్యూటీ స్పీకర్)గా రామచంద్రు నాయక్ నియమితులయ్యారు. దీనిపై రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు. "నూతన మంత్రులుగా బాధ్యతలు స్వీకరించబోతున్న వివేక్ వెంకట స్వామి గారు, అడ్లూరి లక్ష్మణ్ గారు, వాకిటి శ్రీహరి గారికి నా అభినందనలు. శాసనసభలో ఉప సభాపతి బాధ్యతలు స్వీకరించబోతున్న రామచంద్రు నాయక్ గారికి నా అభినందనలు..." అని పేర్కొన్నారు.
కాగా, మంత్రివర్గంలో చాన్స్ దక్కించుకున్న ఈ ముగ్గురు కూడా తొలిసారి ఎమ్మెల్యేలు కావడం విశేషం. వివేక్ వెంకటస్వామి గతంలో ఎంపీగా పనిచేసిన సంగతి తెలిసిందే. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన చెన్నూరు నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. ఇక వాకిటి శ్రీహరి మక్తల్ అసెంబ్లీ స్థానం నుంచి గెలుపొందగా, అడ్లూరి లక్ష్మణ్ ధర్మపురి సెగ్మెంట్లో విజేతగా నిలిచారు.



## తెలంగాణ రాజ్ భవన్ లో మంత్రుల ప్రమాణ స్వీకారం

**హైదరాబాద్ వెలుతురు జూన్ 08:**
తెలంగాణ క్యాబినెట్ లో మరో ముగ్గురు నేతలకు చోటు దక్కింది. కొత్తగా ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లు ఈ రోజు ఉదయం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్ భవన్ లో నూతన మంత్రులతో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ప్రమాణస్వీకారం చేసిన వారిలో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఉన్నారు. తాజా విస్తరణలో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయాన్ని పరిగణనలోకి తీసుకున్నది. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మాత్రమే అవకాశం కల్పించింది. కాగా, ఈసారి మంత్రివర్గ విస్తరణలో సుదర్శన్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలకు చోటు దక్కుతుందని ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. అయితే, ప్రస్తుతానికి ఎస్సీ, బీసీలకు మాత్రమే అవకాశం ఇవ్వాలని అధిష్టానం సూచించినట్లు తెలిసింది. కొత్త మంత్రులతో పాటు శాసనసభ డిప్యూటీ స్పీకర్ గా రామచంద్రునాయకన్ ను కాంగ్రెస్ అధిష్టానం ఎంపిక చేసింది.

### మోదీ, చంద్రబాబు వద్ద చదువుకుని...

# రాహుల్ వద్ద ఉద్యోగం చేస్తున్నా

## - సీఎం రేవంత్ రెడ్డి

- హైదరాబాదులో బండారు దత్తాత్రేయ ఆత్మకథ పుస్తకావిష్కరణ
- హాజరైన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి
- ఇటీవల నీతి ఆయోగ్ సమావేశం సందర్భంగా జరిగిన సంభాషణ వెల్లడించిన వైనం



**హైదరాబాద్ వెలుతురు జూన్ 08:**
హైదరాబాదులో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆత్మకథ పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఓ ఆసక్తికర అంశాన్ని అందరితో పంచుకున్నారు. ఇటీవల తాను ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన నీతి ఆయోగ్ సమావేశానికి హాజరయ్యానని, ఈ సందర్భంగా ఆయనతో కలిసి మధ్యాహ్న భోజనం చేశానని రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా మోదీ... చంద్రబాబు గారిని చూపించి మీ సన్నిహితుడు కూడా ఇక్కడే ఉన్నారు అని చెప్పారు. అప్పుడు నేను... స్కూల్ మీ (బీజేపీ) వద్ద చదువుకున్నాను... కాలేజి ఆయన (చంద్రబాబు) వద్ద చదువుకున్నాను... ఇప్పుడు రాహుల్ గాంధీ వద్ద ఉద్యోగం చేస్తున్నాను అని చెప్పాను. దాంతో అందరూ నవ్వేశారు" అని రేవంత్ రెడ్డి వివరించారు.

### జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ గారి ఆకస్మిక మరణంపై బి.జె.ఎల్.పి. నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి



**హైదరాబాద్ వెలుతురు జూన్ 08:**
జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాధ్ గారి ఆకస్మిక మరణం గ్రేటర్ హైదరాబాద్ కు తీరని లోటు. గ్రేటర్ హైదరాబాద్ రాజకీయాల్లో సీనియర్ నేత, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ గారి ఆకస్మిక మరణంతో తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను. విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లోకి వచ్చిన గోపీనాథ్ గారు కింది స్థాయి నుంచి ఎమ్మెల్యేగా ఎదిగి మంచి ప్రజానాయకుడిగా పేరు గడించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేసేందుకు ఆయన అనునిత్యం జనంతో మమేకమయ్యేవారు. ప్రజాసేవ పట్ల గోపినాధ్ గారికి ఉన్న అంకితభావమే ఆయనను జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించింది. ఆయన పనితీరు రాజకీయాల్లో ఎదగాలనుకునే నాయకులకు ఆదర్శం. ఎమ్మెల్యే మాగంటి గోపినాధ్ గారి మరణం పట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని ప్రార్ధిస్తున్నాను. దివంగత ఎమ్మెల్యే గోపినాధ్ కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

# రామోజీరావు మాకు స్ఫూర్తిదాయకం

- క్రమశిక్షణ, పట్టుదల, నిజాయితీకు నిలువెత్తు రూపం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యలు
- రామోజీకి ఘన నివాళి అర్పించిన సంజయ్



**కరీంనగర్ వెలుతురు జూన్ 08:**
ఈనాడు గ్రూపు సంస్థల అధినేత, పద్మవిభూషణ్ రామోజీరావులోని క్రమశిక్షణ, పట్టుదల, నిజాయితీ ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. చంద్రయాన్ సందర్భంగా వారితో గడిపిన క్షణాలను ఎప్పటికీ మర్చిపోలేనని చెప్పారు. రామోజీరావు వర్ధంతి సందర్భంగా బండి సంజయ్ కుమార్ సిరిసిల్లలో రామోజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రామోజీతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఏమన్నారంటే... ఈనాడు గ్రూపు సంస్థల అధినేత, పద్మవిభూషణ్ రామోజీరావుతో ఉన్న అనుబంధాన్ని మరువలేం. చంద్రయాన్ ను విజయవంతంగా ప్రయోగించిన రోజు రామోజీ ఫిల్మ్ సిటీలోని రామోజీరావును దాదాపు 3 గంటలపాటు గడిపిన క్షణాలు ఇంకా నా కళ్ల ముందే మెదులుతున్నాయి. ఆయనను కలిసిన ప్రతిసారి జరిగే చర్చలు ఎంతగా ఆసక్తిగా ఉండేవి. ఆయనలోని నిజాయితీ, క్రమశిక్షణ, దూరదృష్టి, అనుకున్నది సాధించే వరకు మొండి పట్టుదలతో వ్యవహరించే తీరు నాకెప్పటికీ స్ఫూర్తిదాయకం. రామోజీరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా వారికి ఘన నివాళి అర్పిస్తున్నా. రామోజీ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన ఆశయాల సాధనలో ఈనాడు గ్రూపు సంస్థల మరింత ముందుండాలని కోరుకుంటున్నా. రామోజీ మనమధ్య లేకపోయినా ఆయన స్మృతులు, ఆశయాలు సజీవంగా ఉన్నాయి.

## రైతు మహోత్సవం ముగింపు కార్యక్రమంలో టెలిఫోన్ ద్వారా ప్రసంగించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**సిద్దిపేట జిల్లా వెలుతురు జూన్ 08:**
పంటల సాగు లో నూతన వంగడాలు ,యాంత్రీకరణ ద్వారా వ్యవసాయ సాగు ,ఆయిల్ ఫాం సాగు,డ్రాగన్ ,తదితర పంటల సాగు అంశాలపై రైతు మహోత్సవం లో తెలుసుకున్నాం మూడు రోజుల పాటు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లో రైతు మహోత్సవం కార్యక్రమం చాలా బాగా జరిగింది.. వ్యవసాయ శాఖ అధికారులకు అభినందనలు.. ఈ రైతు మహోత్సవం కార్యక్రమాన్ని కరీంనగర్ ,సిద్దిపేట ,హనుమకొండ ,జనగాం జిల్లాల రైతులు పెద్ద ఎత్తున పాల్గొని అవగాహన చేసుకున్నారు వ్యవసాయ శాస్త్రవేత్తలు , వైస్ చాన్సలర్ లు ,ప్రొఫెసర్లు వివిధ పంటలు ,యంత్రాల వాడకం, స్టాల్స్ లో ఏర్పాటు చేసిన అంశాలపై బాగా అవగాహన కల్పించారు.. వ్యవసాయ కమిషన్ కోదండరెడ్డి గారు కమిషన్ సభ్యులు కూడా రైతు మహోత్సవం లో పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు.. ప్రభుత్వం వ్యవసాయానికి ప్రాధాన్యత



కల్పిస్తుంది ఈ కార్యక్రమం ద్వారా రైతుల్లో చైతన్యం వచ్చింది.. ఒకే రకమైన పంట కాకుండా భిన్న పంటలు వేయాలి మంచి వర్షాలు పడి పాడి పంటలతో ఈ ప్రాంతం సస్యశ్యామలంగా ఉండాలి.. రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది..ఆర్థికంగా అగ్రగామిగా ఉంటుంది.. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ శుభాకాంక్షలు

## మాగంటి గోపీనాథ్ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఏపీ మంత్రి నారా లోకేశ్

- మాగంటి గోపీనాథ్ గుండెపోటుతో మృతి
- తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన నారా లోకేశ్, బ్రాహ్మణి
- మాదాపూర్ లోని గోపీనాథ్ నివాసానికి వెళ్లి నివాళి అర్పించిన లోకేశ్, బ్రాహ్మణి
- గోపీనాథ్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన వైనం

**హైదరాబాద్ వెలుతురు జూన్ 08:**
జూబ్లీహిల్స్ శాసనసభ్యుడు మాగంటి గోపీనాథ్ అకాల మరణం అందరినీ తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్, ఆయన అర్ధాంగి నారా బ్రాహ్మణి కూడా మాగంటి మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వారు హైదరాబాద్ మాదాపూర్‌లోని మాగంటి గోపీనాథ్ నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటించారు. పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించిన అనంతరం, తీవ్ర విషాదంలో ఉన్న గోపీనాథ్ కుటుంబ సభ్యులను లోకేశ్,



## "వేశ్యలు" అంటూ చేసిన ఈ వ్యాఖ్యలను ఉపేక్షించే పరిస్థితే లేదు

- రాజధాని మహిళలపై సాక్షి టీవీలో జర్నలిస్ట్ కృష్ణంరాజు వివాదాస్పద వ్యాఖ్యలు
- జర్నలిస్ట్ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం, ఖండన
- స్త్రీ జాతిని అవమానిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేసిన సీఎం
- మాజీ సీఎం జగన్ తీరుపై చంద్రబాబు అసంతృప్తి, విచారం
- మహిళల మనోభావాలు దెబ్బతీసిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

**అమరావతి వెలుతురు జూన్ 08:**
రాజధాని అమరావతి ప్రాంత మహిళలను ఉద్దేశించి సాక్షి టీవీ ఛానల్ లో కృష్ణంరాజు అనే జర్నలిస్ట్ తీవ్ర అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాజధాని గురించి, అక్కడి మహిళల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా 'వేశ్యలు' అంటూ చేసిన దారుణమైన వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ, మీడియా ముసుగులో సాగుతున్న ఇలాంటి వికృత చేష్టలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. "తన సొంత మీడియా చానల్ ద్వారా జరిగిన ఈ దారుణాన్ని ఒక మాజీ ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి ఇప్పటికీ ఖండించకపోవడం, స్త్రీ జాతికి క్షమాపణ చెప్పకపోవడం మరింత విచారకరం. ఆడబిడ్డలను గౌరవించే సంస్కృతి మనది. స్త్రీమూర్తులను ఆరాధించే సమాజం మనది. ఇది మన సంప్రదాయం. మన భారతీయ జీవన విధానం. ముఖ్యంగా మన తెలుగు ప్రజల విషయానికి వస్తే ఆడబిడ్డను, అమ్మను ఎంతో ఆదరణతో చూస్తాం. అలాంటి మన రాష్ట్రంలో రాజకీయ కక్షతో, మీడియా విశ్లేషణల పేరుతో నిస్సిగ్గుగా ఏకంగా మన తల్లులు, చెల్లెళ్లపై దారుణ వ్యాఖ్యలు చేయడం క్షమించరాని నేరం. వాళ్లు ఎప్పుడూ అనుసరించే ఈ విష సంస్కృతిపై తిరుగుబాటుగా గత ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చినా వారి వైఖరిలో మార్పు రాలేదనేది సుస్పష్టం.రాజధానిపై విషం చిమ్మే కుట్రలో గట్టు దాటి మహిళల మనోభావాలను గాయపరచిన వారిపై అత్యంత కఠిన చర్యలు తీసుకుంటాం. గత విధ్వంస ప్రభుత్వం పై రాజధాని మహిళల పోరాటాన్ని మనసులో పెట్టుకుని ఆ ప్రాంత మహిళలపై ఉద్దేశ్యపూర్వకంగా, నీచాతినీచంగా చేసిన ఈ వ్యాఖ్యలు మొత్తం మహిళా సమాజాన్నే అవమానించడం. మహిళలను గౌరవించే, వారి ఆత్మగౌరవానికి అండగా నిలిచే కూటమి ప్రభుత్వం ఈ నీచ సంస్కృతికి చెక్ పెట్టే బాధ్యత తీసుకుంటుంది" అని చంద్రబాబు పేర్కొన్నారు.



వెలుతురు

# 'స్టార్ లింక్' శాటిలైట్లకు సవాలుగా మారిన సౌర తుపానులు!

- సూర్యుడిలో పెరిగిన క్రియాశీలత
- స్టార్‌లింక్ ఉపగ్రహాలపై ప్రభావం
- భూ అయస్కాంత తుపానులతో వేగంగా కక్ష్య వీడుతున్న శాటిలైట్లు
- 2020-2024 మధ్య 523 స్టార్‌లింక్ ఉపగ్రహాల పతనంపై నాసా అధ్యయనం



**హైదరాబాద్ వెలుతురు జూన్ 08:**
సూర్యుడిలో పెరుగుతున్న తుపానులు భూమి చుట్టూ తిరుగుతున్న ఉపగ్రహాలకు, ముఖ్యంగా ఎలాన్ మస్క్ నేతృత్వంలోని స్పేస్ఎక్స్ ప్రయోగించిన స్టార్‌లింక్ ఉపగ్రహాలకు పెను సవాళ్లు విసురుతున్నాయి. సూర్యుడు తన 11 ఏళ్ల సౌర చక్రంలో గరిష్ఠ స్థాయికి చేరుకుంటున్న వేళ, భూ అయస్కాంత తుపానుల తీవ్రత అధికమవుతోంది. దీని ఫలితంగా అనేక ఉపగ్రహాలు నిర్దేశిత కక్ష్యల నుంచి జారిపోయి, భూ వాతావరణంలోకి వేగంగా తిరిగి ప్రవేశిస్తున్నాయని నాసా తాజా అధ్యయనంలో వెల్లడైంది.

నాసాకు చెందిన గొడార్డ్ స్పేస్ ఫ్లైట్ సెంటర్ అంతరిక్ష భౌతిక శాస్త్రవేత్త డెన్నీ ఒలివెరా బృందం ఈ అధ్యయనం నిర్వహించింది. 2020 నుంచి 2024 మధ్య కాలంలో దాదాపు 523 స్టార్‌లింక్ ఉపగ్రహాలు అకాలంగా భూ వాతావరణంలోకి తిరిగి ప్రవేశించి పడిపోయినట్లు వీరి పరిశోధనలో తేలింది. సూర్యుడి నుంచి వెలువడే తీవ్రమైన సౌర జ్వాలలు, కరోనల్ మాస్ ఎజెక్షన్‌ల (సీఎంఈ) కారణంగా భూమి యొక్క ఎగువ వాతావరణం వేడెక్కి విస్తరిస్తుందని, ఇది భూ నిమ్న కక్ష్య (ఎల్ఈఓ)లోని ఉపగ్రహాలపై వాతావరణ ఘర్షణను పెంచుతుందని శాస్త్రవేత్తలు వివరించారు. ఈ పెరిగిన ఘర్షణ వల్లే ఉపగ్రహాలు వేగంగా తమ కక్ష్యలను కోల్పోతున్నాయి.

ప్రస్తుతం మనం 25వ సౌర చక్రం యొక్క గరిష్ఠ దశలో ఉన్నామని, దీని తీవ్రత అంచనా వేసిన దానికంటే ఎక్కువగా ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ సౌర తుపానుల ప్రభావం స్టార్‌లింక్ ఉపగ్రహాలపై స్పష్టంగా కనిపిస్తోందని, వీటి పునఃప్రవేశాలు సౌర కార్యకలాపాల పెరుగుదలతో సమాంతరంగా సాగుతున్నాయని అధ్యయన పత్రంలో తెలిపారు. స్టార్‌లింక్ వ్యవస్థలో వేల సంఖ్యలో ఉపగ్రహాలు ఉండటం వల్ల, ఈ ప్రభావాన్ని విశ్లేషించడానికి ఇవి ఒక ముఖ్యమైన కేస్ స్టడీగా మారాయి.

స్టార్‌లింక్ ఉపగ్రహాలు ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా మారుమూల ప్రాంతాలకు ఇంటర్నెట్ సేవలు అందించే లక్ష్యంతో ప్రయోగించబడుతున్నాయి. సాధారణంగా ఐదేళ్ల జీవితకాలం ఉండే ఈ ఉపగ్రహాలు, ఆ తర్వాత భూ వాతావరణంలోకి ప్రవేశించి మండిపోయేలా రూపొందించారు. అయితే, ప్రస్తుత సౌర ఉధృతి కారణంగా అవి ముందుగానే కక్ష్యను వీడుతున్నాయి. ఈ పరిణామం అంతరిక్ష వ్యర్థాల సమస్యను పెంచడంతో పాటు, ఖగోళ పరిశీలనలకు కూడా ఆటంకాలు కలిగిస్తుందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఉపగ్రహ ఆపరేటర్లకు ఇది కొత్త నిర్వహణ సవాళ్లను కూడా విసురుతోంది.

# టాలీవుడ్ లో అనూహ్య పరిణామం...
## ఎన్నికైన ఒక్కరోజుకే సునీల్ నారంగ్ రాజీనామా

- టీఎఫ్‌సీసీ అధ్యక్ష పదవికి సునీల్ నారంగ్ రాజీనామా
- ఎన్నికైన 24 గంటల్లోనే పదవి నుంచి తప్పుకోవడంపై చర్చ
- కొందరు తనను సంప్రదించకుండా ప్రకటనలు ఇస్తున్నారని ఆరోపణ
- అలాంటి ప్రకటనలకు తాను బాధ్యుడిని కానని స్పష్టం
- శనివారం మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నికైన సునీల్ నారంగ్



**హైదరాబాద్ వెలుతురు జూన్ 08:**
తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి (తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ – టీఎఫ్‌సీసీ) అధ్యక్ష పదవికి ప్రముఖ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ సునీల్ నారంగ్ అనూహ్యంగా రాజీనామా చేశారు. అధ్యక్షుడిగా ఎన్నికై, బాధ్యతలు స్వీకరించిన 24 గంటలు కూడా గడవకముందే ఆయన ఈ నిర్ణయం తీసుకోవడం తెలుగు సినీ పరిశ్రమలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. శనివారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో టీఎఫ్‌సీసీ నూతన కార్యవర్గాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో సునీల్ నారంగ్ వరుసగా మూడోసారి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా శ్రీధర్‌తో పాటు మరో 15 మంది కార్యవర్గ సభ్యులను కూడా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సునీల్ నారంగ్ మాట్లాడుతూ, థియేటర్ల విషయంలో తరచూ వినిపించే "ఆ నలుగురు" అనే ప్రస్తావనలో వాస్తవం లేదని, థియేటర్లు వాటి యజమానుల వద్దే ఉన్నాయని స్పష్టం చేశారు. అంతేకాకుండా, "హీరోలు దేవుళ్ళతో సమానం. వారికి వ్యతిరేకంగా మాట్లాడే సాహసం ఏ ఎగ్జిబిటర్, డిస్ట్రిబ్యూటర్, నిర్మాత చేయరు" అని వ్యాఖ్యానించారు. అగ్ర కథానాయకుడు పవన్ కల్యాణ్ గురించి మాట్లాడుతూ, "ఆయన ఒక తుపాను లాంటి వారు, ఆయన సినిమాను ఆపగలిగే శక్తి ఎవరికీ లేదు" అని అన్నారు. అయితే, ఇంతలోనే అనూహ్యంగా ఆదివారం ఉదయం సునీల్ నారంగ్ తన రాజీనామాను ప్రకటించారు. తనను సంప్రదించకుండానే కొందరు వ్యక్తులు ప్రకటనలు జారీ చేస్తున్నారని, తన ప్రమేయం లేకుండా వెలువడుతున్న అలాంటి ప్రకటనలకు తాను ఎలాంటి బాధ్యత వహించబోనని ఆయన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో తాను అధ్యక్ష పదవిలో కొనసాగలేనని పేర్కొంటూ రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. కేవలం ఒక్క రోజులోనే చోటుచేసుకున్న ఈ నాటకీయ పరిణామాలు టీఎఫ్‌సీసీ వర్గాల్లోనూ, మొత్తం తెలుగు చిత్ర పరిశ్రమలోనూ తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. రాజీనామా వెనుక ఉన్న అసలు కారణాలపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి.

# ఆరు గ్యారెంటీ చేస్తామని చెప్పి ప్రజలను మభ్యపెడుతున్న కాంగ్రెస్

## పర్యావరణ పరిరక్షణ పురసించుకొని అమ్మ పేరు మీద మొక్కలు నాటిన మండల బిజెపి



**మునుగోడు వెలుతురు జూన్ 08:**
మునుగోడు మండల కేంద్రంలోని సత్యఫంక్షన్ హాల్ లో 11ఏళ్ల పరిపాలన గురించి మునుగోడు మండల పార్టీ అధ్యక్షులు పెంబళ్ల జానయ్య గారి ఆధ్వర్యంలో మండల కార్యశాల నిర్వహించడం జరిగింది. మరియు పర్యావరణ పరిరక్షణ పురసించుకొని అమ్మ పేరు మీద మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి జిల్లా నాయకులు ఈ కార్యక్రమం ఇంచార్జ్ బచ్చనబోయిన దేవేందర్ యాదవ్ నియోజకవర్గ కన్వీనర్ దూడల బిక్షం గౌడ్ గారు పాల్గొని మాట్లాడుతూ మునుగోడు ప్రజల గోడు పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారానికి వచ్చిన తర్వాత ఆరు గ్యారెంటీ చేస్తామని చెప్పి ప్రజలను మభ్యపెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం భారత ప్రధాని నరేంద్ర మోడీ గారు సమర్థవంతమైన నిర్ణయాత్మక నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించాలని అంతేకాకుండా వికాసిత్ భారత్ లక్ష్యం సహకారం దిశగా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతుందని అయోధ్య రామ మందిరం నిర్మాణం 370 ఆర్టికల్ రద్దు సర్జికల్ స్ట్రైక్ ఆపరేషన్ సింధూర్ తోపాటు 2014 ముందు మన దేశంలో 36% ఉన్న పేదరికం గత 11 సంవత్సరాల మోదీ సుపరిపాలనలో 9 శాతం తగ్గిందని అదేవిధంగా డిజిటల్ చెల్లింపులలో ప్రపంచం మొత్తంలో మన దేశం వాటా 40 శాతం పెరిగిందని ఇలా ఎన్నో చరిత్రత్మక విజయాలతో మోదీ ప్రభుత్వం 11 సంవత్సరాలు విజయవంతం చేసుకున్న సందర్భంగా యావత్ భారతదేశం గౌరవ ప్రధానమంత్రికి అభినందనలు తెలుపుతుందని అన్నారు ప్రతి కార్యకర్త రేపు జరగబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో ఎంపిటిసిలు సర్పంచులు వార్డు మెంబర్లు గెలుపు కోసం కృషి చేయాలని దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమానికి బిజెపి జిల్లా కార్యదర్శి బొడిగె అశోక్ గౌడ్. రాష్ట్ర నాయకులు భవనం మధుసూదన్ రెడ్డి. బిజెపి జిల్లా అధికారి ప్రతినిధి మాదగోని నరేందర్ గౌడ్. తాజా మాజీ సర్పంచ్ పగిళ్ల బిక్షం. ప్రచార కార్యదర్శి బండారి యాదయ్య. మండల ప్రధాన కార్యదర్శిలు అక్కెనపల్లి సతీష్. పందుల యాదయ్య పార్టీ సీనియర్ నాయకులు. మండల పదాధికారులు. భూత్ అధ్యక్షులు బూత్ ప్రధాన కార్యదర్శులు. కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నేను కూడా ఓ ఆహ్వానితుడ్ని... అంతే!

## - తొక్కిసలాట అంశంపై సీఎం సిద్ధరామయ్య

- బెంగళూరు తొక్కిసలాట ఘటనపై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య స్పందన
- కేఎస్‌సీఏ ఆహ్వానం మేరకే కార్యక్రమానికి హాజరయ్యానని వెల్లడి
- గవర్నర్ కూడా వస్తున్నారని చెప్పడంతోనే వెళ్లానన్న ముఖ్యమంత్రి
- ఘటనపై ముగ్గురు పోలీసు ఉన్నతాధికారులపై సస్పెన్షన్ వేటు
- సీఎం, డిప్యూటీ సీఎంలదే బాధ్యత అని బీజేపీ ఆరోపణ
- ఆర్సీబీ మార్కెటింగ్ హెడ్ సహా నలుగురి అరెస్ట్



**బెంగళూరు వెలుతురు జూన్ 08:**
గత వారం బెంగళూరులో జరిగిన తొక్కిసలాట ఘటనపై తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఈ అంశంపై తాజాగా స్పందించారు. ఆ కార్యక్రమానికి తనను ఆహ్వానించారని, గవర్నర్ కూడా హాజరవుతున్నారని చెప్పడం వల్లే తాను వెళ్లానని తెలిపారు. ఓ ఆహ్వానితుడిగానే వెళ్లానని స్పష్టం చేశారు.

విలేకరులతో మాట్లాడుతూ, "కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం (కేఎస్‌సీఏ) కార్యదర్శి, కోశాధికారి వచ్చి నన్ను కార్యక్రమానికి ఆహ్వానించారు. మేం ఈ కార్యక్రమాన్ని నిర్వహించలేదు, కేఎస్‌సీఏనే నిర్వహించింది" అని సిద్ధరామయ్య స్పష్టం చేశారు. "గవర్నర్ కూడా వస్తున్నారని వారు నాకు తెలిపారు, అందుకే నేను వెళ్లాను. నన్ను ఆహ్వానించిన తర్వాతే అక్కడికి వెళ్లానంతే తప్ప నాకు మరేమీ తెలియదు. నన్ను స్టేడియంకు ఆహ్వానించలేదు" అని ఆయన వివరించారు.

చిన్నస్వామి స్టేడియం సమీపంలోని విధానసౌధ వెలుపల ముఖ్యమంత్రి, ఇతర నేతలు క్రికెటర్లను కలిశారు. అభిమానుల విజయోత్సవ ర్యాలీ అక్కడే ముగిసింది. అయితే, ఈ వీఐపీల రాకతో పోలీసు బలగాలను విభజించాల్సి వచ్చిందని, దీంతో 1500 మంది పోలీసులున్నా భద్రతా ఏర్పాట్లు పలుచనయ్యాయని ఆరోపణలున్నాయి. ఈ వైఫల్యమే తొక్కిసలాటకు ప్రధాన కారణాల్లో ఒకటని రాష్ట్ర ప్రతిపక్షమైన బీజేపీ ఆరోపించింది.

ఈ ఘటనకు సంబంధించి తగిన భద్రతా ఏర్పాట్లు చేయడంలో పోలీసులు విఫలమయ్యారని రాష్ట్ర ప్రభుత్వం ఆరోపించింది. నగర పోలీసు చీఫ్‌తో సహా ముగ్గురు ఉన్నతాధికారులను "విధి నిర్వహణలో నిర్లక్ష్యం" వహించారన్న ఆరోపణలపై సస్పెండ్ చేశారు. పోలీసులపై తీసుకున్న ఈ చర్య బీజేపీ ఆగ్రహానికి కారణమైంది. ఈ విషయంలో వారిని బలిపశువులను చేశారని ఆ పార్టీ విమర్శించింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లే ఈ తొక్కిసలాటకు ప్రత్యక్ష కారణమని కర్ణాటక అసెంబ్లీ ప్రతిపక్ష నేత ఆర్. అశోక్ ఆరోపించారు. తొలిసారి ఐపీఎల్ టోర్నమెంట్ గెలిచిన ఆర్సీబీ ఆటగాళ్ల సన్మాన కార్యక్రమంలో జరిగిన ఈ తొక్కిసలాటలో 11 మంది మరణించగా, 47 మంది గాయపడ్డారు. 18 ఏళ్లుగా ఈ రోజు కోసం ఎదురుచూసిన లక్షలాది మంది అభిమానులు చిన్నస్వామి స్టేడియానికి పోటెత్తారు. ప్రవేశం ఉచితమని ఆర్సీబీ ప్రకటించడంతో ఒక్కసారిగా గేటు వద్దకు దూసుకెళ్లారు.

ఈ ఘటనపై రాష్ట్ర నేర పరిశోధన విభాగం (సీఐడీ) దర్యాప్తు చేస్తోంది. అంతకుముందు, హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ మైఖేల్ కున్హాతో ఏకసభ్య కమిషన్‌తో విచారణకు ముఖ్యమంత్రి ఆదేశించారు. శుక్రవారం, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) మార్కెటింగ్ హెడ్, డీఎన్ఏ ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ సిబ్బందితో సహా నలుగురిని అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు.

# మాకు సంబంధంలేదని ఆ చానెల్ తప్పించుకోలేదు

## సాక్షి టీవీ చానల్లో అమరావతి మహిళలపై వ్యాఖ్యలు
## ఖండించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
## జర్నలిస్టు ముసుగులో వ్యాఖ్యలు చేశారంటూ ఆగ్రహం
## ఆ వ్యాఖ్యల వెనుక వ్యవస్థీకృత కుట్ర దాగి ఉందని ఆరోపణ
## మహిళలను, బౌద్ధ వారసత్వాన్ని అవమానించడం దారుణమన్న జనసేనాని



**అమరావతి వెలుతురు జూన్ 08:**
ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిపై ఒక టెలివిజన్ ఛానెల్‌లో విశ్లేషకుడి ముసుగులో ఒక వ్యక్తి చేసిన తీవ్ర వ్యాఖ్యల వెనుక వ్యవస్థీకృత కుట్ర ఉందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు అమరావతి ప్రాంత మహిళలను, ఈ నేల చారిత్రక, ఆధ్యాత్మిక, బౌద్ధ వారసత్వాన్ని అవమానించేలా ఉన్నాయని ఆయన తీవ్రంగా ఖండించారు. ఇలాంటి దుష్ప్రచారాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

"ఆ మాటలను ఒక వ్యక్తి చేసిన వ్యాఖ్యలుగా చూడవద్దు. ఆ ఛానెల్ కూడా... ఆ వ్యాఖ్యలతో మాకు సంబంధం లేదు, అవి సదరు వ్యక్తి అభిప్రాయం, మాకు మహిళలంటే ఎంతో గౌరవం అంటూ తప్పించుకోలేదు. వాటిని ప్రసారం చేయడమే కాదు... చర్చ సందర్భంలో కనీసం ఖండించి, తప్పుబట్టలేదు. అంటే ఆ చర్చ వెనుక... నీచ భాషతో రాజధాని ప్రాంతాన్ని, అక్కడ నివసిస్తున్న మహిళలను, ఈ ప్రాంత చారిత్రక నేపథ్యాన్ని, విలసిల్లిన బౌద్ధాన్నీ అవమానించి అవహేళన చేయాలనే కుటిల యత్నం దాగి ఉందనే విషయాన్ని అందరూ గుర్తించాలి" అని స్పష్టం చేశారు.

ఆచార్య నాగార్జునుడు కాలంలో విలసిల్లిన బౌద్ధం
అమరావతిపై నీచ ప్రచారానికి దిగిన వ్యక్తులకు, ముఠాలకు కనీసం ఆ ప్రాంత చారిత్రక నేపథ్యం, ఆధ్యాత్మిక విశేషాలు కూడా తెలియవు అనిపిస్తోంది. మౌర్యులు, ఇక్ష్వాక రాజుల శాసనాలు లభ్యమయ్యాయి. కాకతీయులు ఈ ప్రాంతంలో శాసనాలు వేయించారు. బౌద్ధం విలసిల్లిన నేల అని చైనా యాత్రికుడు హ్యూయన్ త్సాంగ్ రచనలు చెబుతున్నాయి. ఆచార్య నాగార్జునుడు నడయాడిన ప్రాంతమిది. మహాయాన బౌద్ధం ముఖ్య సంప్రదాయంగా ఆ ధర్మం విస్తరించింది. ఆ సంప్రదాయంతోపాటు ఇతర సంప్రదాయాలూ ఇక్కడ ఆదరణ పొందాయి. కాబట్టే ఈ ప్రాంతాన్ని బౌద్ధులు పవిత్రంగా భావిస్తారు. నాటి అమరావతి శిల్పకళారీతి.. బౌద్ధం విస్తరించిన శ్రీలంక, ఆగ్నేయాసియా దేశాల్లో అదరణ పొందింది. ఇంతటి చారిత్రక నేపథ్యం కలిగిన ఈ ప్రాంతంపై నీచ వ్యాఖ్యలు చేసే వ్యక్తులు– ఆ ధర్మాలను విశ్వసించేవారి గురించి ఎప్పుడైనా ఆలోచించారా?

కుల ముద్రలు వేశారు... మహిళలను అవమానిస్తున్నారు
రాజధానిపై గత పాలకుడు, ఆయన సహచరులు కుత్సితమైన వ్యాఖ్యలు చేస్తూ అమరావతి ప్రతిష్ఠను దిగజార్చాలని చూశారు. రాజధానిని శ్మశానంతో పోల్చారు. కుల ముద్ర వేశారు. భూములు ఇచ్చిన రైతులు దీక్షలు చేస్తే తమ రాజకీయ బలంతో అణచివేసే ప్రయత్నం చేసి కేసులుపెట్టి వేధించారు. రాజధాని కోసం భూములు ఇచ్చినవారిలో 32 శాతం ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల రైతులు ఉన్నారు. తాము భూములు ఇచ్చాము, రాజధాని ఇక్కడే ఉండాలని దీక్షలు చేసిన సదరు సామాజిక వర్గంవారిపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయించి ఇక్కట్ల పాల్జేసింది గత ప్రభుత్వం. 14 శాతం బీసీ రైతులు, 20 శాతం రెడ్డి సామాజిక వర్గం, 18 శాతం కమ్మ, 9 శాతం కాపు, 3 శాతం ముస్లిం రైతులు భూములు ఇచ్చారు.

టీవీ ఛానెల్ ద్వారా రాజధాని ప్రాంత మహిళలపై నీచ వ్యాఖ్యలు చేయించారు. అంటే అక్కడ ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర సామాజిక వర్గాల మహిళలందరినీ అవమానించడమే కదా? అమరావతి ప్రాంత చారిత్రక, ఆధ్యాత్మిక విశిష్టతను అవహేళన చేయడమే కదా?

ఈ ప్రాంతంపై కక్షపూరితంగా, ప్రజా రాజధానిగా అభివృద్ధి చేస్తున్న ప్రాంతంపై చెడు ముద్ర వేయడమే ఆ ముఠా దురుద్దేశంగా కనిపిస్తోంది. ఈ విధంగా కుట్రలు చేసి దుష్ప్రచారం చేసిన వ్యక్తులపైనా, వారి వెనుక ఉన్నవారిపైనా రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంది. నీచ వ్యాఖ్యలు చేసినవారిపై చట్ట ప్రకారం చర్యలకు పోలీసులు ముందుకు వెళతారు" అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.